# సింగిల్ పేజీ కథలు

"ఏవండీ! బాబుని పంపించొద్దండీ .." వేడుకోలుగా అంది సుమలత.

అలా అంటూంటే ఆవిడ గొంతు జీరబోయింది. ముఖం కళ తప్పింది.

"ఏవిటి సుమా! చిన్నపిల్లలా ఈ మొండిపట్టు. ఎవరైనా చూస్తే నవ్విపోతారు" అన్నాడు రాజశేఖర్.

"నేను వాడి కన్నతల్లినండీ" అంది.

"ఏం? నేను మాత్రం కన్నతండ్రిని కానా!" అన్నాడు గట్టిగా.

ఊరుకుంది నిశ్శబ్దంగా.

"అయినా తల్లిగా నా కంటే కూడా వాడంటే నీకు అమిత ప్రేమ, అనురాగం ఉండొచ్చు. కాదనను. మనలో వాడంటే ఎవరికి మమకారం ఎక్కువో, తక్కువో ఇప్పుడేం పోటీ పెట్టట్లేదు. వాడి భవిష్యత్ గురించి ఆలోచించాల్సిన సమయమిది" అనునయంగా అన్నాడతను.

"మనకి దూరంగా ఎక్కడికో బాబుని పంపి చదివిస్తేనే వాడి భవిష్యత్ బ్రహ్మాండంగా వుంటుందా? ఏం మన కళ్ళముందుంటే చదవలేడా? ఇదెక్కడి విడ్డూరమండీ!" బుగ్గనొక్కుకుందామె.

"నీ మాటలే చిత్రంగా వున్నాయి. ఎక్కడికో దూరంగా అంటే చంద్రమండలానికి పంపిస్తున్నామా..గురుగ్రహానికి వెళ్తున్నాడనుకున్నావా. గుంటూరుకేగా!" ముఖంలో చికాకు వ్యక్తమవుతుంటే విసుగ్గా అన్నాడు.

మూతి ముడుచుకుందామె.

"ఎప్పుడు చూడాలనుకుంటే అప్పుడు వెళ్ళి బాబుని చూసి రావొచ్చని చెప్పాగా. దీనికే నసపెడతావెందుకు? మహా అయితే మన జగిత్యాల నుండి గుంటూరుకి ఒక్కరోజు ప్రయాణం" చెప్పాడతను.

"ఎంతమంది పేరెంట్స్ తమ పిల్లల్ని అంతదూరం పంపించి చదివిస్తున్నారు చెప్పండి?" ఎదురు ప్రశ్నించింది భర్తని.

"ఎవరి గురించో మనకెందుకు చెప్పు. మన పిల్లవాడి బాగోగులు మనం ఆలోచించుకోవాలి గానీ" సాధ్యమైనంత మృదుత్వం ప్రదర్శించాడు మాటల్లో.

"మీరెన్నయినా చెప్పండి. బాబుని వదలి నేనొక్క క్షణం ఉండలేను." తేల్చి చెప్పేసింది.

"నీ మూర్ఖపు పట్టుదల నీది. చెప్పేది అస్సలు విన్పించుకోవు" అసహనంగా అన్నాడు.

సమాధానంగా ముఖం పక్కకు తిప్పుకుంది.

"వాడింకా పాలుతాగే పసివాడేం కాదు. టెన్త్ పాసయ్యాడు. తల్లిదండ్రుల్ని అంటిపెట్టుకుని తిరిగే స్టేజ్ దాటిన టీనేజ్ కుర్రాడు" సీరియస్‌నెస్ చోటు చేసుకుంది తనలో.

## బాధ్యత

"అదే నా కిష్టం లేదు. అయినా ఆ ఇంటర్మీడియట్ ఏదో ఇక్కడే చదివించండి. మన జగిత్యాల చిన్న పల్లెటూరేం కాదుగా. ట్యూషన్స్ కూడా పెట్టించండి. అంతే కానీ, రెండవ ఆలోచన చేయటానికి నసేమిరా వీల్లేదు" ఖరాఖండిగా చెప్పేసింది.



"నీవనేది వాస్తవమే. అలా కూడా చేయొచ్చు. కానీ సుమా! ఇక్కడున్న కాలేజీలో ఎమ్‌సెట్ కోచింగ్ ఇవ్వడం లేదు. అయితే ఈమధ్యే ఒక కోచింగ్ సెంటర్ ఓపెన్ చేశారు. కోచింగ్ మెరుగైన స్థాయిలో ఉండకపోవచ్చు." భార్యకి విడమరచి చెప్పాడు.

బదులు పలుకలేదామె.

కొన్నిక్షణాలు గడిచాయి.

"ప్లీజ్! నన్ను విసిగించకండి. వద్దు వద్దన్నా విన్పించుకోకుండా నాలుగు విషయాలు తెలుస్తాయి, విజ్ఞానం పెరుగుతుంది..అంటూ ఆరోజు కూడా ఇలాగే పెద్దబాబుని ఎక్స్‌కర్షన్‌కి పంపించారు. ఏం జరిగింది? మన కన్న పేగుని తన పొట్టన పెట్టుకుందా ఎక్స్‌కర్షన్."

సుమలత స్వరస్థాయి తగ్గింది. గొంతులో తడి చేరింది.

"ఏవండీ! గుండెలో వాడి జ్ఞాపకాల తడి ఇంకా ఆరనే లేదు. కనీసం వీడినైనా నా కనుసన్నల్లో మెలగనీయండి"

ఆమె కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయ్.

అది చూసి కాస్త వెనక్కి తగ్గాడు రాజశేఖర్.

ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళి నాగార్జునసాగర్‌లో పడి మృతి చెందిన కొడుకు గుర్తుకు వచ్చి ఆమె కుమిలిపోతుంటే..కాసేపు నిశ్శబ్దమై పోయాడతను. ఆ విషాదం నుండి ఇపుడిపుడే కోలుకుంటోందామె.

రెండు నిమిషాలు భారంగా గడిచాయి.

భార్య అలా విలపిస్తుంటే బాధగా ఫీలయ్యాడు రాజశేఖర్.

"సరే..ఆమె మనసు నొప్పించడం దేనికి? ఆమె ఇష్ట ప్రకారం బాబుని ఇక్కడే ఏదో కాలేజీలో జాయిన్ చేస్తే సరిపోతుంది" అని నిశ్చయించుకుని మౌనం వహించాడతను.

* * *

పనిమనిషి కోసం అదేపనిగా గుమ్మం వైపు తొంగి చూస్తోంది సుమలత.

సాయంత్రం అయిదవుతోంది.

రోజా ఆ సమయానికి పనంతా ముగించేసుకుని వెళ్ళిపోవాల్సిందే. కానీ ఎందుకో ఈ రోజింకా రానే లేదు. రానని చెప్పలేదు.

సుమ ఆలోచిస్తుండగానే గేటు తీసుకొని లోపలికి హడావుడిగా వచ్చేసింది పనిమనిషి రాములమ్మ.

"ఏం రాములమ్మా..ఎన్నడూ లేనిది ఈరోజు ఇంత ఆలస్యంగా వచ్చావేం?" సంజాయిషీ కోరుతున్నట్లుగా కాకుండా నవ్వుతూ ప్రశ్నించింది.

"రోజుట్లాగే బయల్దేరినానమ్మా! మీ ఈది సివరింట్లో జనాలు మూగితే ఏందని పోయిన. ఆ ఇంట్ల ముసల్ది సచ్చిందట. సెవం సూసిన గదా, ఇటల్లె మంచిగుండదని మల్ల ఇంటికిపోయి తానం సేసొత్తున్న" బదులిచ్చింది రాములమ్మ.

"ప్రొద్దున బట్టలారేయడానికి డాబా పైకెళితే చాలా జనం కన్పించారక్కడ. ఏంటీ అంతమంది పోగయ్యారనుకున్నా. అదా విషయం. మరా శవాన్ని ఇంతక్రితం చూసానన్నావ్. ఇంకా దహన సంస్కారాలవలేదా?" ఆసక్తిగా అడిగింది.

"యాడైనయమ్మా! ఆ ముసల్దానికి ఒక్కడే పోరడట. అద్దుర బిడ్డా అని ఆ తల్లి ఎంత మొత్తుకున్నా దుబాయ్‌కి పోయిండంట. ముసల్దాని తిండి కోసం తాపకిన్ని పైసలైతే పంపుతున్నాడటగానీ అయిదేండ్ల నుంచి మాత్రం పత్తకు లేడట. కన్నకొడుకు దగ్గర్లేని రంధికే ముసల్ది సగం సచ్చింది. రోగంతో ఇయ్యాల పూర్తిగా సచ్చిపోయింది" తాను తెలుసుకున్న విషయాలన్నీ ఏకరువు

పెట్టిందా పనిమనిషి.

"మరి కొడుక్కి ఫోన్ చేశారా?"

"ఉన్నఫళంగా రమ్మంటే ఏడ కుదు ద్ది. సేయాల్సిన పన్లేవో సెయ్యుండి. ఖర్సులకు పైసల్ ంపిత్తానన్నాడట."

రాములమ్మ చెబుతున్నది విని, స్టన్నం పోయిందా సుమలత.

"కన్నతల్లి చనిపోతే కన్నకొడుకు రానడా? కనీసం కడచూపుకైనా రావాలన్పించలేదా? ఇదేం గుబంధం? తల్లి దహనసంస్కారాలు పూర్తిచేయడం కుగ్గా అతని బాధ్యత కాదా?"

సుమ మనసంతా నైరాశ్యంతో నిండిపో యింది.

సుమకి చప్పున భర్త మాటలు గుర్తు వచ్చాయా సమయంలో.

"కొడుకు మీద అంత అనుబంధం ంచుకుంటున్నావ్. రేపు వాడు పెరిగి, పెద్దవాడై ఉ గం రీత్యానో మరో కారణం చేతనో నీకు దూరంగా ండిపోతాడు. అప్పుడు కూడా వాడు నిన్ను అంటిపెట్టుక ే ఉండాలని కోరుకుంటావా? పిచ్చి సుమా! పిల్లల ద తల్లిదండ్రులు వాత్సల్యం పెంచుకోవడం తప్పేమీ కాదు. కానీ వాళ్ళ నుండి తిరిగి అదే రీతిలో ప్రేమాభిమానాల్ని, ఆదరణని ఆశించడం మాత్రం ఈరోజుల్లో స్వార్థమే అవుతుంది. ఎందుకంటే అవి దక్కనినాడు నీకు నిరాశే మిగులుతుంది.

పరిస్థితుల ప్రభావం వల్ల రేపు నీ కొడుకు నీ మాటకి విలువనీయక పోవచ్చు. ఎదురు మాట్లాడొచ్చు. అప్పుడు తట్టుకోగలవా? అందుకే సుమా! ఇప్పటి నుండైనా బాబుకి దూరంగా ఉండేలా అలవాటుచేసుకో. లేకపోతే ముందుముందు నీ గుండె భరించలేదు. నీ మనసేంటో నాకు బాగా తెలుసు."

భర్త మాటలు మనసు పొరల్లో ప్రతిధ్వనిస్తుంటే సుమ అంతరంగాన్ని శూన్యం ఆవరించింది.

యజమానురాలి వాలకం చూసి ఆశ్చర్యపోయింది రాములమ్మ.

"అదేందమ్మా! ముసల్దాని గురించి సెబితే నువ్వలా కొయ్యబారిపోయావు" అనడిగిందామె.

సుమ ఆలోచన్ల నుండి తేరుకుందా మాటకి.

"ఏం లేదు రాములమ్మా! అంత కష్టపడి గుండెల్లో పెట్టుకుని పెంచిన కన్నకొడుకు కనీసం చచ్చి శవమైనా చూడ్డానికి రాలేదంటే ఆ ముల్దెంత దురదృష్టవంతురాలో చూడు. అన్నీవుండి చివరికి దిక్కులేని దానిలా పడి వుంది.." అంది నిర్లిప్తంగా.

రాములమ్మ దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచింది.

"కడుపు తీపి అందరిదీ ఒకటే అయినా ఎవరి కడుపుకోత ఎట్టాగుంటుందో ఎవరికెరుకమ్మా?" అంది లోపలికి వెళుతూ.

మళ్ళీ ఆలోచన్లు చుట్టుముట్టాయి సుమని.

భర్త మాటలు గుర్తుకు రాసాగాయి మళ్ళీ.

"పిల్లల్ని తీర్చిదిద్ది, ప్రయోజకుల్ని చేయడం వరకే తల్లిదండ్రులుగా మనవంతు బాధ్యత. అందుకే సుమా..మన బాధ్యతల్ని మనం నిర్వర్తించాలి. ఆ తర్వాత వాళ్ళ జీవితం వాళ్ళిష్టం. ఇది జీవిత సత్యం."

"నిజమే! తల్లిగా నా బాధ్యతని విస్మరించకూడదు. అబ్బాయిని పంపేందుకు ఒప్పుకోవాలి". అనుకొని తన నిర్ణయం చెప్పడానికి భర్త కోసం ఎదురు చూడసాగింది సుమలత.

**- వేణుగోపాల్ (జగిత్యాల)**

# గంతకుతగ్గ బొంత

"ఒసేయ్! మల్లీ, బేగి రాయే మీమామ నీకు చీరట్టుకొచ్చాడు" తల్లిమాట చెవిలో పడగానే ఒక్క పరుగున గుడిశెలోకి వచ్చిన మల్లి మేనమామ చేతిలో చీర చూసి నీరసపడిపోయింది.


అది...ఆ చీర పసుపు పచ్చరంగులో రేడీ బోర్డరుతో బాగానే వుంది. కానీ కొత్తచీర కాదు. నడి పాతచీర. నిరాసక్తంగా బయటికొచ్చేసింది మల్లి. అందుకు కారణం లేకపోలేదు. మల్లి తండ్రి ఆమె చిన్నతనంలోనే పోయాడు. రంగమ్మ నాలుగిళ్ళలో పనిచేస్తూ సంసారం లాక్కొస్తూంది. మల్లి తర్వాత యింకా యిద్దరు ఆడపిల్లలున్నారు. ఈ ముగ్గురికీ తను పని చేసే యిళ్ళల్లో పిల్లల పాతబట్టలు తెచ్చి, వాటితోనే కాలక్షేపం చేయటం అలవాటు చేసింది. చెల్లెళ్ళ సంగతేమో కానీ మల్లికి మాత్రం కనీసారన్నా కొత్తబట్టలు కట్టుకోవాలని ఆశ! దానికి కారణం వుంది.

మల్లి ఎలిమెంటరీ స్కూల్లో ఐదవ తరగతి చదివే రోజుల్లో తోటి పిల్లలు ఆమెను ఆటపట్టించేవారు. ఏ ఆగస్టు పదిహేనుకో, జనవరి ఇరవై ఆరుకో స్కూల్లో జెండా వందనం ఉందని చెప్తే, రంగమ్మ రోజువారీ స్కూలుకు వేసుకువెళ్లే బట్టలు కాకుండా పెట్టెలో దాచి వుంచిన పరికిణీ, జాకెట్టు తీసి ఇచ్చేది. అవి వేసుకుని వెళ్తే క్లాసులో పిల్లలు తలా ఒకరకంగా ఎగతాళి చేసేవారు.

"ఏమిటే మల్లీ! కొత్తబట్టలు వేసుకోలేదేం" అని ఒకరంటే

"ఇవి రోజూ వేసుకునేవి కావు! కొత్తవే కానీ సరికొత్తవిలా లేవు. ముందుగా గుడికికానీ సినిమాకిగానీ కట్టుకున్నావేంటే మల్లి" అని ఒకరు అనేవారు.

"అసలు ఎప్పుడు స్కూలుకి కొత్తబట్టలు వేసుకొచ్చినా అవి పాతవాటిలాగా కొంచెం నలిగినట్లుంటాయేంటే" అని ఒకరంటే,



"అది కాదే! వాళ్ల అమ్మ మార్కెట్‌లో సెకండ్ హ్యాండ్ బట్టలషాపులో కొంటుందేమో". అని క్లాసులో అందరికన్నా పెద్దదయిన గంగ అనేది. అంతా గొల్లున నవ్వేవారు. ఇలా రెండు మూడుసార్లు జరిగేసరికి సిగ్గుపడి స్కూలు మానేసింది మల్లి.

ఆమె వ్యక్తురాలయిన సందర్భంలో కూడా ఆ కోరిక తీరనే లేదు. అప్పుడే అనుకుందామె పెళ్లినాటికి అమ్మ కొనలేకపోయినా అత్తవారు కొత్తచీరలు తేకపోలేరులే అని. ఇప్పుడు ఇంకో పదిరోజుల్లో మల్లికి పెళ్లి. మేనమామ తెచ్చిన పాతచీర చూస్తూ అనుకుంది త్వరలో తను కొత్తచీరలు కట్టుకోవచ్చు అని. ఆ ఆలోచనే ఆమెకు ఎక్కడలేని ఉద్వేగాన్ని కలిగించింది. తనకు పెళ్లి అన్నప్పట్నించీ కూడా పెళ్లి కొడుకు తాపీమేస్త్రీ అనే మాట తప్ప ఇంకేం పట్టించుకోలేదు పెళ్లివారి గురించి. ఎంతసేపూ ధ్యాసంతా కొత్తచీరలు మీదే నాయె. తల్లి మాత్రం పదే పదే 'ఏదో లెమ్మా గంతకు తగ్గబొంత' అంటూనే వుంది. ఆ మాటన్నా సరిగ్గా వినివుంటే ఇప్పుడింత నిరాశకు గురయ్యేది కాదు.

ఆరోజు ఉదయమే కాబోయే ఆడబడుచు సీత వచ్చింది. ఓ బాస్కెట్ నిండా చీరలు తీసుకుని. "ఇదిగో అత్తమ్మా! మా వదినకు ఏ చీరలు నచ్చుతాయో చూసి రెండు చీరలెంచుకోమంది మాయమ్మ. మళ్లీ మిగిలిన చీరలు మార్కెట్ కంపెయ్యాలంట" సీత మాట వింటూనే గంపెడాశతో వచ్చింది మల్లి. చాపపరచింది రంగమ్మ. సీత నిదానంగా ఒక్కో చీరా తీస్తుంటే బ్రమ్మపడిపోయింది మల్లి. అది..అవన్నీ పాత చీరలే! చీరలు బైటపడ్తూనే గలగల మాట్లాడేస్తూంది సీత. "నిన్న మా అయ్యకి యాపారం బాగా జరిగిందట. అటువెళ్ళిన స్టీలు సామానంతా అయిపోయిందట. వచ్చినయన్నీ పట్టుచీరలూ జరీ చీరలూనూ. వదినకి కావలసిన చీరలు ప్రక్కనపెట్టి తక్కినవి మార్కెట్లోకి పంపుద్దంట." ఇక ఆపైన ఏమీ వినలేదు మల్లి. తల్లి అస్తమానూ అనే 'గంతకుతగ్గబొంత'కి యిప్పుడే అర్థం తెలిసిందామెకి.

**-సాధనాల నాగవర్ధని (నూజివీడు)**